సమగ్ర తెలుగు దినపత్రిక
Website: www.adugunews.com
# అడుగు
The Step Towards The Truth..
హైదరాబాద్ | ఆదివారం 24 ఆగస్టు 2025 | సంపుటి: 01 | సంచిక: 243 | పేజీలు: 4 | వెల: రూ.6:50
Published from Telangana, Andhra Pradesh | చీఫ్ ఎడిటర్: డాక్టర్ మార్గం లక్ష్మీనారాయణ | Mail: adugudaily@gmail.com

## సుంకాల వ్యవహారం

**పోస్టల్‌పై తీవ్ర ప్రభావం**
**అమెరికాకు పోస్టల్ కన్‌సైన్‌మెంట్ల నిలిపివేత**

న్యూఢిల్లీ,ఆగస్ట్23(అడుగు న్యూస్): అమెరికాకు అన్నిరకాల పోస్టల్ సేవలను భారత్ నిలిపివేసింది. అయితే ఇది తాత్కాలికమేనని పోస్టల్ విభాగం వెల్లడించింది. కొన్ని మినహాయింపులతో భారత్ అమెరికాకు తమ పోస్టల్ సేవలను తాత్కాలికంగా నిలిపివేసింది. భారత్‌పై పలు రకాల సుంకాల విధింపుల ఆదేశాలను అమెరికా ఈ నెల 29వ తేదీ నుంచి అమలులోకి తీసుకువస్తోంది.

మిగతా 3లో..

## గుట్టలా? నోట్ల కట్టలా!

**కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇంట్లో లభ్యం**
**ఢిల్లీలో కర్నాటక ఎమ్మెల్యే కేసీ వీరేంద్ర అరెస్టు**

న్యూఢిల్లీ,ఆగస్ట్23(అడుగు న్యూస్): అక్రమ ఆన్‌లైన్ బెట్టింగ్ రాకెట్ నిర్వహిస్తున్నారనే ఆరోపణలతో అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యే కేసీ వీరేంద్ర అరెస్టు అయ్యారు. శనివారం అతడ్ని అదుపులోకి తీసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఓ ప్రకటనలో తెలియజేసింది.

మిగతా 3లో..

# 'కోటా'పై కమిటీ!

## పార్టీ పరంగానే బీసీ రిజర్వేషన్లు



- స్థానిక సంస్థల ఎన్నికలపై స్పష్టత
- 26 కల్లా సర్కారుకు నివేదిక
- 27న డెడికేషన్ కమిటీకి నివేదన
- 29న కేబినెట్‌లో నిర్ణయం
- భట్టీ, ఉత్తమ్, పొన్నం, శ్రీధర్, సీతక్కలతో కమిటీ
- ఎన్నికలకే అందరి మొగ్గు
- బీసీలకు మనతోనే న్యాయం:సీఎం

**తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నెలకొన్న సందిగ్ధతకు రాష్ట్ర ప్రభుత్వం తెరదించింది. బీసీ రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి, గవర్నర్ల ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్నప్పటికీ, ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. తమ పార్టీ పరంగా బీసీలకు 42 శాతం సీట్లను కేటాయించాలని తీర్మానించింది. స్థానిక ఎన్నికలను ఆలస్యం చేయొద్దని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో మరికొద్ది రోజుల్లోనే స్థానిక సమరానికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సన్నద్ధమవుతుండగా, స్థానిక ఎన్నికలు కూడా త్వరలోనే జరగున్నాయి.**

హైదరాబాద్,ఆగస్ట్ 23(అడుగు న్యూస్): తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నెలకున్న సందిగ్ధతకు ఎట్టకేలకు రేవంత్ రెడ్డి సర్కార్ తెరదించింది. బీసీ రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి ఆమోదం కోసం పెండింగ్ లో ఉన్నప్పటికీ, ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో అధికార కాంగ్రెస్ పార్టీ తన తరపున పోటీ చేసే అభ్యర్థుల్లో 42శాతం సీట్లను బీసీ వర్గాలకు కేటాయించి ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధమవుతోంది. శనివారం సాయంత్రం గాంధీభవన్ లో నిర్వహించిన కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో పలు అంశాలపై నేతలు చర్చించారు. రాష్ట్రంలో బీసీలకు రిజర్వేషన్లను పెంచుతూ సర్కార్ రూపొందించిన

మిగతా 2లో..



# మేం పార్టీ మారనే లేదు!?
## బీఆర్ఎస్ లోనే ఉన్నాం

- అసెంబ్లీ రికార్డులు చూడండి
- స్పీకర్ నోటీసులకు ఎమ్మెల్యేల జవాబు?
- ఢిల్లీ నుంచి వచ్చాక మిగిలిన వారికి నోటీసులు?
- స్పీకర్ నోటీసులపై సర్వత్రా ఉత్కంఠ
- ఉప ఎన్నికలపై గంపెడాశతో బీఆర్ఎస్

హైదరాబాద్,ఆగస్ట్ 23(అడుగు న్యూస్): ఫిరాయింపుల కేసు విచారణకు సంబంధించి నిర్దేశిత సమయాన్ని ఆ నోటీ-సుల్లో పేర్కొనలేదని సమాచారం. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు నిర్దేశిరచిన గడువు లోపల పది మంది ఎమ్మెల్యేలపై విచారణ పూర్తి చేసి స్పీకర్ ప్రసాద్‌కుమార్ నిర్ణయం ప్రకటిస్తారా..? లేక పెండింగ్‌లో పెడతారా..? అన్నది చర్చనీయాంశంగా మారింది. మరోవైపు, ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటు-న్న పలువురు ఎమ్మెల్యేలు తాము బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నామంటూ పలు సందర్భాల్లో ప్రకటించారు. శాసనసభ రికార్డుల్లోనూ పది మంది ఎమ్మెల్యేలూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే ఉన్నారు. సుప్రీంకోర్టు గడువు ముగిసేలోపు స్పీకర్ ఏ నిర్ణయం

మిగతా 2లో..

**సుప్రీం కోర్టు తీర్పును గౌరవించి బీఆర్ఎస్ ఫిర్యాదులపై విచారణ చేపట్టాలని స్పీకర్ నిర్ణయించుకున్న క్రమంలో ఏం జరగబోతుందన్న చర్చ సాగుతోంది. స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారని అంతా ఉత్కంఠగా చూస్తున్నారు. ముఖ్యంగా విపక్ష బిఆర్ఎస్ ఈ విషయంలో ఆసక్తిగా ఉంది. ఎలాంటి నిర్ణయం రాబోతందున్నది ఇప్పడు ఆసక్తిగా మారింది. ఉప ఎన్నికలు రావఆలని కూడా బిఆర్ఎస్ కోరుకుంటోంది. సుప్రీం తీర్పు ఆధారంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఐదుగురు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు. అయితే మిగిలిన మరో ఐదుగురికి కూడా త్వరలో నోటీసులు జారీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.**



## మన సీఎం యే టాప్!

- రేవంత్ రెడ్డిపై 89 కేసులు
- 12మందిపై క్రిమినల్ కేసులు
- ఎన్నికల అఫిడవిట్ల ఆధారంగా ఏడీఆర్ రిపోర్టు



న్యూఢిల్లీ,ఆగస్ట్23(అడుగు న్యూస్): దేశ రాజకీయాల్లో ఓ ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. దేశవ్యాప్తంగా ఉన్న 30 మంది ముఖ్యమంత్రుల్లో ఏకంగా 12 మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు స్వయంగా ప్రకటించారు. ఈ సంచలన వివరాలను అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రీఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ తన తాజా నివేదికలో వెల్లడించింది. ఈ జాబితాలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 89 కేసులతో అగ్రస్థానంలో నిలవడం గమనార్హం. ఏడీఆర్ నివేదిక ప్రకారం రేవంత్ రెడ్డి తర్వాత తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్‌పై 47 కేసులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిపై 19 కేసులు ఉన్నాయని

మిగతా 2లో..

## 'కాళేశ్వరాన్ని' సీబీఐకివ్వాలి


- కమిషన్ నివేదిక ప్రకారమే చర్యలు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి డిమాండ్
- హైదరాబాద్‌లో 4 లక్షల బోగస్ ఓట్లు
- జాబితాను సమగ్రంగా సవరించాల్సిందే



హైదరాబాద్,ఆగస్ట్ 23(అడుగు న్యూస్): కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక ప్రకారం సీబీఐ విచారణ జరిపించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ నివేదికపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూస్తామని ఆయన అన్నారు. ఈరోజు మీడియాతో మాట్లాడుతూ, హైదరాబాద్‌లో దాదాపు 4 లక్షల

మిగతా 2లో..

# ఆ తీర్పిచ్చిన జడ్జీలంతా నక్సల్సేనా?



- తీర్పు చదివితే షా అలా మాట్లాడరు
- సల్వాజుడుంపై తీర్పు సుప్రీం ది
- నేనే రాశా కానీ, నా తీర్పు కాదు
- ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

న్యూఢిల్లీ,ఆగస్ట్23(అడుగు న్యూస్): సల్వా జుడుం తీర్పుపై కేంద్రహోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి స్పందిస్తూ అది తాను ఇచ్చినది కాదని, సుప్రీం కోర్టు

మిగతా 3లో..

## అంతా తూచ్!
### ఆ హత్యలు కట్టు కథే

- ధర్మస్థలలో జరిగిందంతా తప్పుడు ప్రచారమే
- గుర్తించిన ప్రత్యేక దర్యాప్తు బృందం
- ఫిర్యాదు చేసిన మాజీ ఉద్యోగి అరెస్ట్

న్యూఢిల్లీ,ఆగస్ట్23(అడుగు న్యూస్): ధర్మస్థలలో వందల మందిని హత్య చేశారని..తానే వాటిని కాల్చివేయడం లేదా పూడ్చి పెట్టడం చేశానని ఫిర్యాదు చేసిన చిన్నయ్య అలియాస్ చెన్న అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అబద్దాలు చెప్పి.. తప్పుదోవ పట్టించాడని.. కుట్ర చేశాడని ప్రత్యేక దర్యాప్తు బృందం గుర్తించింది. అతన్ని అరెస్టు చేసి కోర్టులో

మిగతా 3లో..



## మెరుపు ధర్నా

- యూఎస్పీసీ ఉద్యోగుల ఆందోళన
- పాత పెన్షన్ విధానం, ఏకీకృత రూల్స్ పై నిరసన
- ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలపై గళం
- ప్రభుత్వం విశ్వసనీయత నిలుపుకోవాలి
- మహాధర్నాలో పలువురు వక్తల డిమాండ్



హైదరాబాద్,ఆగస్ట్ 23(అడుగు న్యూస్): ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎసపీసీ) ఆధ్వర్యంలో శనివారం ఇందిరా పార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించి, రాష్ట్ర ప్రభుత్వం విశ్వసనీయత నిలుపుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ప్రజా ప్రభుత్వంలో సమస్యలన్నీ పరిష్కారమవుతాయని ఉపాధ్యాయులు ఆశించారని, వినతిపత్రాలు ఇస్తూ 20 నెలలుగా ఓపికతో ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. మ్యానిఫెస్టో హామీలూ అమలు చేయడం లేదన్నారు. గత ప్రభుత్వం విద్యా రంగ సమస్యలపై ప్రజాస్వామ్యబద్ధంగా

మిగతా 2లో..

## విద్యార్థులపై విష ప్రయోగం!

**టీచర్ల మధ్య విభేదాలే కారణం**
**హాస్టల్ నీటి ట్యాంకులో పురుగుల మందు కలిపిన ఓ టీచర్**
**ఆ నీరు తాగి 11 మంది విద్యార్థులకు తీవ్ర అస్వస్థత**
**వైద్యశాలకి తరలించడంతో తప్పిన ప్రాణాపాయం**
**ఆ టీచర్ సహా నలుగురి సస్పెన్షన్**



హైదరాబాద్,ఆగస్ట్ 23(అడుగు న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జరిగిన విద్యార్థుల అస్వస్థత ఘటన వెనుక అసలు కథ అందర్నీ షాక్ అయ్యేలా చేసింది.. ప్రభుత్వ ఉపాధ్యాయుల మధ్య విభేదాలే ఆ విద్యార్థుల ప్రాణాలకు ముప్పు తెచ్చినట్టు జిల్లా కలెక్టర్ పరిశీలనలో తేలింది.. విద్యార్థులు తాగే వాటర్ ట్యాంక్ లో పురుగుల మందు కలిపినట్లుగా గుర్తించారు.. ఆ దారుణానికి ఒడిగట్టిన ఉపాధ్యాయుడు సహా నలుగురిని సస్పెండ్ చేశారు.. మరోవైపు పోలీస్ విచారణ కొనసాగుతోంది. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా

మిగతా 2లో..

## జోహార్! కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి!



ఇప్పటిదాకా నాలోని ఉత్తేజం, ఉద్వేగం ఇప్పుడు ఆయనలో ప్రవేశించాయి. నాచేయి బిగ్గరగా పట్టుకుని వదలకుండా, ఆనాటి ఊసులు నాతో కొద్దిసేపు కలబోసుకున్నారు. పాలకుర్తి ప్రాంత ఆనాటి, నేటి ప్రముఖులని, ప్రజలందరినీ కలుసుకుని, ఆలింగనం చేసుకున్నంత ఆనంద పడ్డారు. 'ఇవ్వాళ నేను గొప్ప ఉద్యమ వైతాలిక వారసుడిని కలిశా'నంటే, 'కాదు నేనే పాలకుర్తి ప్రాంత ప్రముఖుడిని కలిశాన'న్నారు. అది ఆయన అతి సాధారణ గొప్ప ఔన్నత్యానికి, అత్యంత నిరాడంబరతకు, సాయుధ పోరాట స్ఫూర్తికి, ఆయన ఉద్యమ నేపథ్య మూర్తికి తార్కాణాలు. సుర'వరం'తో పాలకుర్తి 'మార్గం'లో... కొన్ని జ్ఞాపకాలు!* అడుగు చీఫ్ ఎడిటర్ డా.మార్గం లక్ష్మీనారాయణ ప్రత్యేక వ్యాసం

ఎడిటోరియల్ పేజీ 2లో

# సంపాదకీయం
## మార్గం - అడుగు



## నిబద్ధ, నిస్వార్థ రాజకీయ నేత సురవరం!

నేటి స్వార్థ రాజకీయాల్లో నిస్వార్థంగా నేనున్నానని చెప్పుకోదగిన ఉదాత్త రాజకీయవేత్త సురవరం సుధాకర్ రెడ్డి. ఆజన్మాంతం సామాన్యుడిగానే ఉంటూ, అసామాన్య రాజకీయ ప్రతిభను ప్రదర్శించిన వ్యక్తి ఆయన. దేశం గర్వించదగ్గ సురవరం మన తెలుగువాడు, తెలంగాణవాడు కావడం మనకు గర్వకారణం.

కమ్యూనిస్టు రాజకీయాల్లో ఉంటూనే సురవరం సుధాకర్ రెడ్డి, దేశ రాజకీయాల్లో ప్రభావశీలమైన ముద్రవేశారు. అయితే, కమ్యూనిస్టులు ఏకం కావాలన్న ఆయన కోరిక మాత్రం తీరకుండానే పోయారు. ఎప్పుడూ ప్రజా సమస్యలతోనే ఆయన జీవితం ముడిపడి ఉండేది. తెలంగాణ కమ్యూనిస్టు దిగ్గజాలలో గతేడాది సీతారాం ఏచూరిని కోల్పోయాం. ఏడాదిలోపే ఇప్పుడు సురవరంను కోల్పోయాం. జాతీయ రాజకీయాల్లో తెలుగువారు కనుమరుగు అవుతున్నారు. గట్టిగా నిలబడే నేతలు లేకుండా పోతున్నారు. ఈ క్రమంలోనే సురవం, వృద్ధాప్య అనారోగ్య కారణాలతో మనలను వీడిపోయారు.

ఆయన రాజకీయాల్లో అజాతశత్రువు. అంతకు మించిన నిస్వార్థం ఆయనకు ఆభరణం. పీడిత, తాడిత వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసిన తెలంగాణ ముద్దుబిడ్డ. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రధాన కార్యదర్శిగా సురవరం సుధాకర్ రెడ్డి సమస్యలు ఎక్కడున్నా వాటి పరిష్కారానికై పోరాడేందుకు ఎప్పుడూ ముందుండే వారు. సమస్యలపై ఎంత గట్టిగా పోరాడేవారో ఆయన అంతకుమంచి సౌమ్యుడు. ఆయన సౌమ్యత్వానికి, పోరాటానికి పొంతన ఉండేది కాదు. కానీ జన్మతః వచ్చిన మృదు స్వభావం కారణంగా ఆయన అజాత శతృవు అయ్యారేమో అనిపిస్తుంది. ఆయన మాట్లాడినంత సేపు ఇంకా వినాలనిపిస్తుంది. సాదాసీదాగా ఉంటూ జాతీయ రాజకీయాల్లో చెలామణి కావడం చాలా కష్టం. కానీ అది సాధ్యమని రుజువు చేసిన దిగ్గజనేత సురవం. తెలంగాణ వైతాళికుడు, గోల్కొండ పత్రిక వ్యవస్థాపకుడు సురవరం ప్రతాపరెడ్డి తమ్ముడు స్వాతంత్ర్య సమరయోధుడు వెంకటరామిరెడ్డి కుమారుడు సుధాకర్‌రెడ్డి. అటు తండ్రి, ఇటు పెదనాన్న వారసత్వ లక్షణాలు పుణికి పుచ్చుకున్నారు. ఒకవైపు పెదనాన్న సాంస్కృతిక ఉద్యమ ఆదర్శాలను, మరోవైపు తండ్రి స్వాతంత్య పోరాట స్ఫూర్తిని పుణికిపుచ్చుకున్న సుధాకర్‌రెడ్డి, చిన్న వయసులోనే సమస్యలపై పోరుబాట పట్టిన తీరు అమోఘం. కర్నూలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న రోజుల్లోనే బ్లాక్‌బోర్డు, చాక్‌పీస్ వంటి కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంపై నిరసన చేపట్టారు. అది ఉద్యమంగా మారి, నగరంలోని మిగతా విద్యాలయాలకు వ్యాపించింది. అన్ని స్కూల్స్ కి అవి సమకూరాయి.



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి జాతీయ స్థాయి నేతగా సురవరం ఎదిగారు. దివంగత జైపాల్ రెడ్డితో పాటు ఆయన కూడా కమ్యూనిస్టు ఉద్యమంలో రాటుదేలారు. ఎన్నో వామపక్ష ఉద్యమాలు, ఎన్నో ప్రజా పోరాటాల్లో పాలు పంచుకున్నారు. రెండుసార్లు నల్గొండ పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికైన సురవరం సుధాకర్ రెడ్డి దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన గొప్ప నాయకుడనిపించుకున్నారు. పోరాటలు, ప్రజా ఉద్యమాల పట్ల ఉన్న నిబద్దత కారణంగా ప్రజానేతగా సురవరం గొప్ప పేరు సంపాదించుకున్నారు. పీడిత వర్గాల అభ్యున్నతి కోసం జీవితకాలం కృషి చేశారు.

తెలంగాణ ఉద్యమంతో ఆయనది విడదీయరాని అనుబంధం. ఏఐఎస్‌ఎఫ్ నుంచి ప్రారంభమైన ఆయన ప్రస్థానం సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి వరకు సాగింది. 2012 నుంచి 2019వరకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పదవిలో కొనసాగారు. మూడు దఫాలుగా ఆయన జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2000లో విద్యుత్ బిల్లుల పెంపునకు వ్యతిరేకంగా వామపక్షాలు చేసిన పోరాటంలో సురవరం ది ముఖ్యమైన పాత్ర. చంద్రరాజేశ్వరరావు తరువాత జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన రెండో తెలుగు వ్యక్తిగా సురవరం నిలిచారు. 1960లో ఏఐఎస్‌ఎఫ్ కర్నూలు పట్టణ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆతర్వాత కర్నూలు జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. 1962లో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఏర్పాటు కోసం చేసిన సమ్మెకు కమిటీ కార్యదర్శిగా ఉన్నారు. ఈ కమిటీ- 62రోజుల పాటు- చేసిన సమ్మెకు నాయకత్వం వహించారు. అనంతరం కర్నూలులోని కళాశాల విద్యార్థుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1965లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎల్‌ఎల్‌బీ చదువుతున్న సమయంలో కళాశాల విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల ఫలితాల అనంతరం ఏఐఎస్‌ఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాధ్యతలను సురవరానికి అప్పగించారు. 1966లో ఏఐఎస్‌ఎఫ్ జాతీయ ప్రధానకార్యదర్శి అయ్యారు. దీంతో ఆయన ఢిల్లీకి మకాం మార్చారు. 1969లో రెండోసారి ప్రధాన కార్యదర్శిగా తిరిగి ఎన్నికయ్యారు. 1970లో ఏఐఎస్‌ఎఫ్, 1972లో ఏఐవైఎఫ్‌నకు జాతీయ అధ్యక్షుడయ్యారు. 1971లో కేరళలోని కొచ్చిన్‌లో జరిగిన సీపీఐ 9వ నేషనల్ కౌన్సిల్ సమావేశాల్లో జాతీయ కమిటీ- సభ్యుడయ్యారు. 1974లో తిరిగి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన సురవరం ఆనాటి నుంచి 1984 వరకు సీపీఐ ఉమ్మడి ఏపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పనిచేశారు. 1985, 90లో కొల్లాపూర్ అసెంబ్లీ నుంచి సురవరం సుధాకర్ రెడ్డి పోటీ- చేసి ఓడిపోయారు. 1994లో కర్నూలులోని డోన్‌లో అప్పటి సీఎం విజయ భాస్కర్‌రెడ్డిపై పోటీచేసి ఓడిపోయారు. 1998లో ఏపీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఇలా ఒక్కో మెట్టు ఎక్కినా, ఒదిగే ఉన్నారు. ఇంతటి ఉన్నత లక్షణాలు, ఉదాత్త ఆశయాలు కలిగిన సురవరం మనవాడు కావడం మన అదృష్టం అయితే, మనకు లేకుండా పోవడం మన దురదృష్టం.

# జోహార్! కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి!

## సుర'వరం'తో పాలకుర్తి 'మార్గం'లో... కొన్ని జ్ఞాపకాలు!

అది 2001వ సంవత్సరం. అప్పటికే నేను నాగర్ కర్నూలులో వార్త స్టాఫ్ రిపోర్టర్ గా ఉన్నాను. అనతి కాలంలోనే నేను రాసిన అనేక వార్తా కథనాలు నన్ను జర్నలిస్టుగా బాగా ఎస్టాబ్లిష్ చేశాయి. నల్లమలలో నక్సల్స్, పోలీసులు, వెనుకబాటుతనం, వలసలు, వారి వెతలు, అటవీ ప్రాంతాలు, ప్రజల సమస్యలు, పెండింగ్ ప్రాజెక్టులు, చారిత్రకాంశాలు, వాటి ఆధారాలు ఎన్నో రాసే అవకాశం ఇచ్చింది నాగర్ కర్నూలు. 'నిన్న బండచాకిరీ కొండమ్మ, నేడు పాతాల పంతులమ్మ' శీర్షికతో వచ్చిన కథనం, ఆనాడు వార్తలో 'జీవన విజయం' అనే శీర్షిక ప్రారంభానికి ఆద్యమైంది. ఆతర్వాత కూడా అదే శీర్షికకు అనేక కథనాలు రాసే అవకాశం దక్కింది. నా 'వార్త'లతోపాటు, నాక్కూడా మంచిపేరు వచ్చింది. పూర్తి అపరిచతమైన నాకు, ఆ మొత్తం ప్రాంతానికి 'వార్త'లు నన్ను సుపరిచితుడిని చేశాయి.

నాగర్ కర్నూలు పోస్టాఫీసు ఎదురుగా ఉన్న బంగళా ఫస్ట్ ఫ్లోర్ లో మా ఆఫీసుండేది. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలవుతోంది. కంప్యూటర్లో తల దూర్చి బిజీగా ఉన్న సమయంలో మా టౌన్ రిపోర్టర్ అహ్మదుల్లాఖాన్ పరుగున వచ్చాడు. 'సార్ మీకీ విషయం తెలుసా? తెయదన్నాను. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి గారు వస్తున్నారట.' యథాలాపంగా 'ఎప్పుడు? ఎక్కడికి?' అంటే, 'నాగర్ కర్నూలుకే సార్, మరికొద్దిసేపటికే' అన్నాడు. ఆ సమయంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఉన్న లింగారెడ్డి గారి ఇంటికన్న సంగతీ చెప్పాడు. నాకు పెద్దగా పట్టించుకోవాల్సిన విషయంగా తోచలేదు. నా నిరాసక్తతని గుర్తించిన అహ్మద్, సార్ వెళ్ళి కలుద్దామా? అన్నాడు. అయినా పెద్దగా స్పందించలేదు. కానీ, లోలోపల ఏదో లాగుతోంది. వెళ్తే పోలా? అనిపించింది. చిన్నప్పుడు బహుషా 5వ లేదా 6వ తరగతి తెలుగు వాచకంలో అనుకుంటా, సురవరం ప్రతాప్ రెడ్డి గురించి చదువుకున్న పాఠం గుర్తుకు వచ్చింది. పత్రికా సంపాదకుడిగా, పరిశోధకుడిగా, పండితుడిగా,



రచయితగా, ప్రేరకుడిగా, క్రియాశీల ఉద్యమకారుడిగా, బహుముఖాలుగా అనన్య సామాన్యంగా సాగిన ప్రతాపరెడ్డి ప్రతిభ, కృషి గుర్తుకు వచ్చాయి. 1926లో అతను నెలకొల్పిన గోలకొండ పత్రిక తెలంగాణ సాంస్కృతిక గమనంలో మైలురాయి. అందులోని సంపాదకీయాలు నిజాంని సూటిగా ప్రశ్నించేవి. నిజాంకు కోపం వచ్చి, సంపాదకీయాలు సమాచార శాఖ అనుమతితోనే ప్రచురించాలని నిబంధన పెట్టాడు. దాన్ని తిప్పికొడుతూ ప్రతాప రెడ్డి ప్రపంచ మేధావుల సూక్తులను సేకరించి సంపాదకీయానికి బదులుగా ప్రచురించాడు. అది మరింత సమస్యగా నిజాం ప్రభుత్వం భావించిందట. అంతటి మేధావి, తెలంగాణ పత్రికలకు మొదటి, రెండో తరం మహా మనిషి, పైగా నేనూ పత్రికా రంగంలోనే ఉన్నాను. గ్రంథకర్త, జర్నలిస్టు రాపోలు ఆనంద భాస్కర్ గారి స్ఫూర్తితో అప్పటికే అప్పటి 'ఆంధ్రజ్యోతి'లో, ఇప్పటి 'సాక్షి' మాతృక చెన్నూరి నాగరాజు గారి 'సాక్షి'కి ఉప సంపాదకుడిగా పని చేసి, డాక్టర్ రాపోలు సత్యనారాయణ గారి చొరవతో సిరికొండ భాస్కర్ 'ఓరుగల్లు టైమ్స్', దాసరి యాకయ్య 'అభిప్రాయం', కమ్మగాని రమేశ్ 'పాలకుర్తి వాణీ' పత్రికలను సంపాదకుడిగా ప్రారంభించి ఉన్నాను. 'జర్నలిస్టూ, సురవరం ప్రతాపరెడ్డి, అతడి తమ్ముడు స్వాతంత్ర్య సమరయోధుడు వెంకట్రామ్ రెడ్డిల వంశపారంపర్యుడు, ఇప్పటి నాగర్ కర్నూలు జిల్లా, కోదేరు మండలం గంద్రావుపేటలో పుట్టిన తెలంగాణ బిడ్డ, నల్లగొండ లోక్ సభ సభ్యుడు, పైగా కమ్యూనిస్టు నాయకుడు, సీపీఐకి రాష్ట్ర కార్యదర్శి.. కలుద్దామా?' అనిపించింది.

అప్పట్లో అనేక తెలంగాణ ఉద్యమవేదికలతో ఏర్పడ్డ తెలంగాణ ఐక్యవేదిక, తెలంగాణ సాధన సమితి, తెలంగాణ రాష్ట్ర సమితిలు తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని రగుల్ కొల్పుతున్నాయి. మిగతా అన్ని రంగాల్లో లాగే, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలోనూ పాలమూరు వెనుకబడి ఉంది. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంపై ఆయనతో ఏదైనా మాట్లాడితే? సాలోచనగా అహ్మద్ తో 'వెల్దాం పద' అంటూ బయలుదేరాను.

దారి పొడవునా ఒకటే ఆలోచనలు. ఆయన్ని ఏమడగాలి? ఆయన స్పందనలెలా ఉంటాయి? నా నేపథ్యాన్ని గుర్తు చేస్తే కచ్చితంగా ఆయన సానుకూలంగా స్పందిస్తారు లే? అన్న ధైర్యంతో ఆయన ముందు నిలబడ్డాను. లింగారెడ్డి గారు నన్ను సుధాకర్ రెడ్డిగారికి పరిచయం చేశారు.

ఆయన్ని చూడటం అదే మొదటిసారి. బహుషా నాన్నలోని సాత్వికత, పెద్దనాన్నలోని పోరాట పటిమల కలబోత. ముట్టుకుంటే కందిపోయేంత రంగుతేలి, సకుమారంగా, సాదా సీదా బట్టల్లో సాత్వికంగా ఉన్న ఆయన, సూటిగా కళ్ళల్లోకే నవ్వుతూ కరచాలనం చేశారు. నా ఒంట్లో ఏదో నాకే తెలియని ఉత్తేజం. మనసులో ముసురుకున్న ఉద్వేగం.. నేను సురవరం ప్రతాప్ రెడ్డి గారిని కలిశానా!? సుధాకర్ రెడ్డి గారినే కదా? అని లిప్తపాటు తడబాటు.. సర్, నా పేరు చెప్పి, 'మాది పాలకుర్తి' అన్నాను. అంతే, ఒక్కసారిగా ఆయన 'పాలకుర్తా?' అన్నారు. 'అవును సర్, పాలకుర్తె.. తెలంగాణ సాయుధ పోరాటం, విసునూరు దేశ్ ముఖ్, చాకలి ఐలమ్మ, షేక్ బందగీ, దొడ్డి కొమురయ్య, నల్లా నర్సింహులు, వరదాచారి, పాల్కురికి సోమనాథుడు, బమ్మెర పోతన, వల్మీడి వాల్మీకిల పాలకుర్తే మా పాలకుర్తి' అన్నాను. 'ఆ ఊరి వాడివా?' అణువంత ఆశ్చర్యంతో అడిగారు. 'అవును. అదే ఊరు' అన్నాను. అంతే, వెంటనే ఇద్దరి పాత్రలూ రివర్స్ అయ్యాయి. ఇప్పటిదాకా నాలోని ఉత్తేజం, ఉద్వేగం ఇప్పుడు ఆయనలో ప్రవేశించాయి. నాచేయి బిగ్గరగా పట్టుకుని వదలకుండా, ఆనాటి ఊసులు, సాయుధ పోరాట సంగతులు నాతో కొద్దిసేపు కలబోసుకున్నారు. పాలకుర్తి ప్రాంత ఆనాటి, నేటి ప్రముఖులని, ప్రజలందరినీ కలుసుకుని, ఆలింగనం చేసుకున్నంత ఆనంద పడ్డారు. 'ఇవ్వాళ నేను గొప్ప ఉద్యమ వైతాలిక వారసుడిని కలిశా'నంటే, 'కాదు నేనే పాలకుర్తి ప్రాంత ప్రముఖుడిని కలిశానని' అన్నారు. అది ఆయన అతి సాధారణ గొప్ప ఔన్నత్యానికి, అత్యంత నిరాడంబరతకు, సాయుధ పోరాట స్ఫూర్తికి, ఆయన ఉద్యమ నేపథ్య మూర్తికి తార్కాణాలు.

అయితే, కొద్దిసేపటికే నాలోని జర్నలిస్టు ముందుకు వచ్చాడు. సురవరం సుధాకర్ రెడ్డిని ప్రశ్నలతో ముంచెత్తాడు? నల్లగొండ ఎంపీగా చేస్తున్న అభివృద్ధి, సీపీఐ ఉద్యమ కార్యాచరణ, తెలంగాణ ఉద్యమం పట్ల సీపీఐ వ్యతిరేకత, ఉదాసీనత, సాయుధ పోరాట ఉద్యమాల పార్టీ అయి ఉండీ తెలంగాణ ఉద్యమాలకు దూరంగా ఉంటడం, పట్టించుకోకపోవడం, ప్రజా సమస్యలపై పార్టీ ఉద్యమాల తగ్గుముఖం, కమ్యూనిస్టు పార్టీగా బూర్జువా పార్టీలతో పొత్తులు, ఎత్తులు, అవగాహనలు వంటి అనేక అంశాల మీద ప్రశ్నలతో ఆయనపై దాడి చేసినంత పనైంది. అయినా, ఆయన ఓర్పుతో నేర్పుగా, నెమ్మదిగా నవ్వుతూ, సాలోచనగా జవాబులిచ్చారు. ఎంతైనా ఆయనా ఒకప్పటి, ఇప్పటికీ రాస్తూ ఉన్న జర్నలిస్టే కదా!? ఆయనను కొద్దిసేపు కలిసిన ఆనాటి జ్ఞాపకాలతోపాటు అవన్నింటినీ మోసుకుని, దాసుకుని, ఒడబోసుకుని ఆరోజు, ఆతర్వాత అనేక కథనాలు, వార్తల్లో కూడా రాసుకున్నాను. ఇప్పటి ఈ జ్ఞాపకాల దాకా! అయితే ఇప్పుడు ఆయన లేరు. ఆయన ఉద్యమ అడుగు జాడలు, ఆయన జ్ఞాపకాలు మాత్రమే ఉన్నాయి. జోహార్! కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి!



-డాక్టర్ మార్గం లక్ష్మీనారాయణ

## 'కాళేశ్వరాన్ని' సీబీఐకివ్వాలి

మొదటిపేజీ తరువాయి..

డబుల్ ఓట్లు ఉన్నాయని, రాష్ట్రంలో ఓటర్ల జాబితాను సమగ్రంగా సవరించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. తాము ఓట్ల చోరీకి పాల్పడితే లోక్‌సభలో తమ పార్టీ సీట్లు ఎందుకు తగ్గాయని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రానికి యూరియా సరఫరా అంశంపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనతో ఫోన్‌లో మాట్లాడారని కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణకు అదనంగా 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా కావాలని కోరారని, రాష్ట్రానికి రావాల్సిన వాటాను తప్పకుండా పంపిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం సాంకేతిక కారణాల వల్ల రామగుండం ఫ్యాక్టరీలో యూరియా ఉత్పత్తి నిలిచిపోయిందని ఆయన వివరించారు. పార్టీ ఫిరాయింపుల అంశంపై స్పందిస్తూ, ఈ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ దొందూ దొందేనని విమర్శించారు. బీజేపీలోకి ఎవరైనా రావాలనుకుంటే, తమ పదవులకు రాజీనామా చేసి రావాలని ఆయన స్పష్టం చేశారు. మొయినాబాద్ ఫాం హౌస్ కేసుతో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని మరోసారి తేల్చి చెప్పారు. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుపై మాట్లాడుతూ, మెట్రో ప్రస్తుతం నష్టాల్లో నడుస్తోందని, దీంతో కొత్త లైన్ల నిర్మాణానికి ఎల్ అండ్ డీ సంస్థ సుముఖంగా లేదని అన్నారు. అయితే, మెట్రో రెండో దశ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. బీహార్‌లో బీజేపీ తప్పకుండా అధికారం చేపడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## మన సీఎం యే టాప్!

మొదటిపేజీ తరువాయి..

వారి అఫిడవిట్లలో పేర్కొన్నారు. కర్ణాటక సీఎం సిద్ధరామయ్యపై 13, ఝూర□ండ్ సీఎం హేమంత్ సొరేన్‌పై 5, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ లపై 4 చొప్పున కేసులు నమోదయ్యాయి. కేరళ సీఎం పినరయి విజయన్‌పై 2, పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌పై ఒక క్రిమినల్ కేసు ఉన్నట్టు ఏడీఆర్ స్పష్టం చేసింది. కేవలం కేసుల సంఖ్యే కాకుండా వాటి తీవ్రత కూడా ఆందోళన కలిగించే అంశం. ఈ జాబితాలోని కనీసం 10 మంది ముఖ్యమంత్రులపై హత్యాయత్నం, కిడ్నాపింగ్, అవినీతి వంటి తీవ్రమైన నేరారోపణలు ఉన్నాయని కూడా ఏడీఆర్ తన నివేదికలో తెలిపింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ నివేదికకు రాజకీయంగా ప్రాధాన్యం ఏర్పడింది.

## మేం పార్టీ మారనే లేదు!?

మొదటిపేజీ తరువాయి..

తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నోటీసులు జారీ చేశారు. బీఆర్ఎస్‌లో గెలించి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేల్లో ఐదుగురికి శుక్రవారం నోటీసులు పంపించారు. వీరి విచారణ ముగిసిన తర్వాత మరికొందరికి నోటీసులు ఇచ్చే అవకాశం ఉన్నది. వచ్చే వారం నుంచి వీరి విచారణ ప్రారంభమయ్యే అవకాశం ఉన్నది. బీఆర్ఎస్ కు చెందిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారని, ఫిరాయింపు నిరోధక చట్టం కింద వారిని అనర్హులుగా ప్రకటించాలని దాఖలైన కేసులో 3 నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని గత నెల 31న సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దానిపై అడ్వొకేట్ జనరల్, సీనియర్ న్యాయవాదులతో స్పీకర్ చర్చించారని సమాచారం. ఆ తర్వాతే ఆ ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు- తెలుస్తున్నది. పార్టీ ఫిరాయించిన కడియం శ్రీహరి, దానం నాగేందర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సంజయ్‌కుమార్, తెల్లం వెంకట్రావు, అరెకపూడి గాంధీ, కాలె యాదయ్య, ప్రకాశ్‌గౌడ్, కృష్ణమోహన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డిలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ కోరింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వారందరికీ నోటీ-సులు ఇచ్చి, వివరణ తీసుకొన్న తర్వాత స్పీకర్ తుది నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. స్పీకర్ నోటీసులతో ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఏం చేస్తారనే అంశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. కాగా, తనకు నోటీసులు అందాయని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు.

## 'కోటా'పై కమిటీ!

మొదటిపేజీ తరువాయి..

బిల్లు ప్రస్తుతం రాష్ట్రపతి పరిశీలనలో ఉంది. ఈ ప్రక్రియకు మరింత సమయం పట్టే అవకాశం ఉండటంతో..ఎన్నికలను ఆలస్యం చేయడం సముచితం కాదని ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలోనే చట్టపరమైన ఆమోదం కోసం వేచి చూడకుండా పార్టీ స్థాయిలో రిజర్వేషన్లను అమలు చేసే ప్రజాతీర్పు కోరాలని సర్కార్ నిర్ణయించింది. రాష్ట్ర స్థాయిలో పెండింగ్ లో ఉన్న కమిటీల నిర్మాణంపై కూడా చర్చించారు. ఏఐసీసీ పిలుపు మేరకు ఓట్ చోరీ, గద్దీ ఛోడ్ ఉద్యమాన్ని చేపట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి లోగోను ఆవిష్కరించారు. యూరియా కొరతపై బీఆర్ఎస్, బీజేపీ చేస్తున్న రాజకీయాలు కూడా నేతల మధ్య చర్చకు వచ్చిన తెలుస్తోంది. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో అనుసరించాల్సిన వ్యూహాలపై కూడా చర్చించినట్లు సమాచారం. బీసీ లకు విద్యా,ఉద్యోగాలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తు మంత్రి వర్గం లో ఆమోదించి అసెంబ్లీ లో బిల్ పాస్ చేసుకున్నామని.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తు విడిగా మరో బిల్ తీసుకొచ్చామని పీఏసీ సమావేశంలో రేవంత్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతం మించకుండా కేసీఆర్ చట్టం తెచ్చారని.. ఈ అడ్డంకిని తొలగించడానికి ఆర్డినెన్స్ తెచ్చామన్నర్నా. కేసీఆర్ తెచ్చిన చట్టాన్ని సవరించడానికి ఆర్డినెన్సు తెచ్చాం..దాన్ని గవర్నర్ కేంద్రానికి పంపారని అన్నారు. కేసీఆర్ తెచ్చిన చట్టం ప్రకారం బీసీ లకు ఒక్క శాతం రిజర్వేషన్ కూడా రాదు .. 90 రోజులలో రాష్ట్రపతి బిల్లులను ఆమోదించాలన్న అంశం పైన సుప్రీమ్ కోర్టు లో మన రాష్ట్ర వాదనలు వినిపించడం కోసం ఇద్దరు న్యాయవాదులను నియమించామని రేవంత్ తెలిపారు. అందులోనే రాష్ట్రపతి దగ్గర ఉన్న మన బీసీ బిల్లు అంశం ప్రస్తావనకు వస్తుంది.. విడిగా సుప్రీం కోర్టు కు వెళ్తే కేసు లిస్ట్ కావడానికి బాగా సమయం పడుతుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి హామీ ఇచ్చి.. అలా అయితేనే స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామని ప్రచారం చేసి.. ఇప్పుడు పార్టీపరమైన రిజర్వేషన్లు అని అనడం ఏమిటని విపక్షాలు విరుచుకుపడే అవకాశం ఉంది.

## మెరుపు ధర్నా

మొదటిపేజీ తరువాయి..

నిరసనలు తెలిపినా సహించలేక సంఘ నాయకులపై అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురిచేసిందని ఆరోపించారు. విద్యా శాఖలో ఎన్జీవోల జోక్యాన్ని నివారించాలని, కొత్త జిల్లాలకు డీఈవో, ప్రతి రెవెన్యూ డివిజన్‌కు డిప్యూటీ ఈవో, కొత్త మండలాలకు ఎంఈవో పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్ రూపొందించి, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. సీపీఎసను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని, పీఆర్‌సీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఐక్య పోరాటాలు చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. ధర్నాలో యూఎసపీసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు చావ రవి, సీహెచ్ అనిల్ కుమార్, ఎం సోమయ్య ఏ వెంకట్, ఎన్ తిరుపతి, టీ లింగారెడ్డి, కొమ్ము రమేష్, ఎస్ హరికిషన్, జాడి రాజన్న, బీ కొండయ్య, వై విజయకుమార్, జాదవ్ వెంకట్రావు, మేడి చరణ్‌దాస్, దూడ రాజనర్సు బాబు మాట్లాడారు. భాగస్వామ్య సంఘాల నాయకులు, జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సహా ఐదువేల మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, టీజీఈజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీలు ప్రొ. నాగేశ్వర్, అలుగుబెల్లి నర్సిరెడ్డి, ప్రొ.లక్ష్మీనారాయణ, అరుణోదయ విమలక్క, పెన్షనర్ల సంఘం ఉపాధ్యక్షులు ఎల్ అరుణమ్మ తదితరులు ధర్నాకు సంఘీభావం తెలిపారు.

## విద్యార్థులపై విష ప్రయోగం!

మొదటిపేజీ తరువాయి..

కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్లో జరిగింది.. శుక్రవారం కలుషిత మంచినీరు సేవించి 11 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.. వారిని వెంటనే ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది.పిల్లలు అస్వస్థత గురయ్యారని తెలియగానే భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే శనివారం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు.. ఈ ఘటనపై ఆరా తీయడంతో అసలు కథ బయటపడింది.

# జనరల్

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..

## పాలకుర్తిలో ఉల్లాస్ శిక్షణా శిబిరం

పాలకుర్తి, ఆగస్టు 23 (అడుగు న్యూస్): పాలకుర్తి మండల కేంద్రంలో నవభారత సాక్షరతా కార్యక్రమం ఉల్లాస్ మండల స్థాయి శిక్షణా సమావేశం మండల విద్యాధికారి పోతుగంటి



నరసయ్య అధ్యక్షతన జరగగా, జిల్లా లైసెన్ అధికారి విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, 15 ఏళ్లు పైబడిన నిరక్షరాస్యులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. రిసోర్స్ పర్సన్లుగా ఎన్. శ్రీనివాస్, ఆర్. క్రాంతి కుమార్ శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామ విఓఏలు, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఇన్చార్జి రమేష్, టాస్ ఇన్చార్జి రవి తదితరులు పాల్గొన్నారు.

## సోమన్న ఆలయంలో పూర్ణాహుతి

పాలకుర్తి, ఆగస్టు 23 (అడుగు న్యూస్): పాలకుర్తి శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శనివారం పూర్ణాహుతితో శ్రావణమాస ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. ఈ



సందర్భంగా స్వామివారికి విశేషాలంకరణతో గవ్యాంతపూజలు, శ్రీ సూక్త పూజావిధానాలు, లలితా సహస్రనామ చండీ హవనము, బిల్వార్చన, కుంకుమార్చన, తులసి అర్చన, పరివారదేవత హవనములు నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, నీరాజనమంత్ర పుష్పార్చనలు, తీర్థప్రసాదాల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో మోహన్ బాబు దంపతులు, అర్చకులు దేవగిరి లక్ష్మన్న, డివిఆర్ శర్మ, దేవగిరి అనిల్ కుమార్, మత్తగజం, నాగరాజు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## మహా ధర్నాకు తరలిన యుఎస్పీసీ నాయకులు

దేవరుప్పుల, ఆగస్టు 23 (అడుగు న్యూస్): హైదరాబాద్ ధర్నా చౌక్ వద్ద పెండింగ్ సమస్యలు, రిటైర్డ్ ఉ



పాధ్యాయుల పెండింగ్ బిల్లుల సాధన కోసం జరిగిన మహా ధర్నా కార్యక్రమంలో పాలకుర్తి నుంచి %ఖ్వాజ% జిల్లా స్టీరింగ్ కమిటీ భాద్యులు పాల్గొన్నారు. కమిటీ సభ్యులు ఎం.డి. షరీఫ్, ఇమ్మడి అశోక్, బాబాయ్య, చిదురాల శ్రీనివాస్, దేవగిరి సూర్యప్రకాష్, కొండయ్య, తోట వెంకటేశ్వర్లు తదితరులు ధర్నాలో పాల్గొని తమ సమస్యల పరిష్కారం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఎరువుల షాపుల ఆకస్మిక తనిఖీలు

దేవరుప్పుల, ఆగస్టు 23 (అడుగు న్యూస్): పాలకుర్తి మండల కేంద్రంలోని ఎరువుల షాపులను సీఐ జానకిరామ్



రెడ్డి, ఎస్ఐ లింగారెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా షాపు యజమానులు స్టాక్ రిజిస్టర్ సక్రమంగా నిర్వహించాలి, అలాగే ప్రభుత్వ సూచనల ప్రకారం నిర్ణయించిన ధరలకే ఎరువులను అమ్మాలని ఆదేశాలు జారీ చేశారు. రైతులకు అన్యాయం జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది, ఎరువుల షాపు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జనహిత పాదయాత్రను విజయవంతం చేయాలి

### ఉమ్మడి వరంగల్ జిల్లాలో జనహిత పాదయాత్రపై సమీక్షలో మంత్రులు

హన్మకొండ, ఆగస్టు 23 (అడుగు న్యూస్): హన్మకొండ జిల్లా డిసిసి భవన్‌లో





తెలంగాణ పిసిసి ఆధ్వర్యంలో నిర్వహించనున్న జనహిత పాదయాత్రపై ఉమ్మడి వరంగల్ జిల్లా సమీక్ష సమావేశం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అధ్యక్షతన జరగగా, రాష్ట్ర మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీతక్క, పాదయాత్ర కో ఆర్డినేటర్లు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఠాగూర్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, టిపిసిసి ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, ఎంపీలు బలరాం నాయక్, కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు యశస్విని రెడ్డి, నాగరాజు, కార్పొరేషన్ చైర్మన్లు, నాయకులు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా మంత్రి సీతక్కలు మాట్లాడుతూ, రాహుల్ గాంధీ ఆలోచన మేరకు ప్రజా ప్రభుత్వ అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ పాదయాత్ర ఉద్దేశమని చెప్పారు.
వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో ఆగస్టు 25న ఇల్లంద మార్కెట్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు భారీగా యాత్ర జరగనుందని వివరించారు. పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల విజయమే లక్ష్యమని, ప్రతి బ్లాక్, మండలాల అధ్యక్షులు పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి 5 వేల మంది కార్యకర్తలను తీసుకురావాలని, మిగతా నియోజకవర్గాల నుంచి కనీసం 1000 చొప్పున రావాలని సూచించారు. మొత్తం 10 వేల మంది పాల్గొనేలా పాదయాత్రను చరిత్రాత్మకంగా నిర్వహిస్తామని తెలిపారు. రేపటి నుంచి ఉమ్మడి జిల్లాలో అన్ని మండల స్థాయి నేతలతో సమన్వయం చేస్తామని ప్రకటించారు. సమావేశానికి ముందు వామపక్ష సీనియర్ నేత సురవరం సుధాకర్ రెడ్డి మరణంపై మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల, గ్రామ స్థాయి కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నవరాత్రులపై పీస్ కమిటీ సమావేశం

### పోలీసుల కీలక సూచనలు

వర్ధన్నపేట, ఆగస్టు 23 (అడుగు న్యూస్): రాబోయే గణపతి నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించేందుకు వర్ధన్నపేట సబ్ డివిజన్ స్థాయి పీస్ కమిటీ సమావేశంలో ఏసిపి అంబటి నర్సయ్య ముఖ్య





అతిథిగా హాజరుకాగా, పాలకుర్తి పోలీస్ స్టేషన్‌లలో పీస్ కమిటీ సమావేశంలో సీఐ జానకిరామ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా ఆయా సమావేశాల్లో వారు మాట్లాడుతూ, గణేష్ మండపాలకు తప్పనిసరిగా పోలీస్ శాఖ నుండి అనుమతులు తీసుకోవాలని సూచించారు. మట్టి విగ్రహాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, రోడ్లపై మండపాలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.
ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలిగినా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. డిజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు లేవని, మైక్‌ల ఏర్పాటు కోసం పోలీస్ అనుమతి తప్పనిసరి అని అన్నారు. ప్రతి మండపంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే మండపాల వద్ద భక్తుల కోసం క్యూలైన్లు ఏర్పాటు చేయాలి, రెండు నీటి బకెట్లు తప్పనిసరిగా ఉంచాలి. రాత్రి వేళల్లో కమిటీ సభ్యులు విధిగా ఉండాలని, ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గణేష్ నవరాత్రులను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. నిమజ్జన శోభాయాత్రలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఈ సమావేశంలో పాల్గొన్న మత పెద్దలు, గ్రామస్థులు, కమిటీ సభ్యులు పోలీసులు చేసిన సూచనలు పాటించి పండుగను ప్రశాంతంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ దూలం పవన్ కుమార్, లింగారెడ్డి, గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## సుంకాల వ్యవహారం

మొదటిపేజీ తరువాయి..

ఈ క్రమంలోనే 800 డాలర్ల వరకూ విలువ చేసే సరుకులపై ఇప్పుడు ఉన్న డ్యూటీ- ఫ్రీ మినిమ్స్ రద్దుకు కూడా అమెరికా నిర్ణయించింది. ఈ క్రమంలో పోస్టల్ సర్వీసెస్‌ను భారతదేశం నిలిపివేసింది. ఈ మేరకు భారత పోస్టల్ విభాగం శనివారం అధికారిక ప్రకటన వెలువరించింది. 100 డాలర్ల వరకూ విలువచేసే లెటర్స్, డాక్యుమెంట్లు- , కానుకలు తప్పితే మిగిలినవి ఏవీ కూడా ఇక అమెరికాకు పోస్టు ద్వారా వెళ్లేందుకు వీలుండదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల మోత మోగిస్తున్నారు. మిత్రదేశం భారత్‌ను వదల్లేదు. రష్యా చమురు కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారత్‌పై అమెరికా అధ్యక్షుడు అదనపు సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ఆగస్టు 27 నుంచి 50శాతం సుంకాలు అమల్లోకి రానున్న నేపథ్యంలో.. వీటి గడువును ట్రంప్ పొడిగిస్తారని తాను ఆశించడం లేదని వైట్‌హౌస్ వాణిజ్య సలహాదారు పీటర్ నరావో ఇప్పటికే పేర్కొన్నారు. గతంలో ట్రంప్ ప్రకటించినట్లు–గా వచ్చే వారం కొత్త టారిఫ్ అమల్లోకి వచ్చే అవకాశం ఉందన్నారు. అయితే ఈ సుంకాల వసూళ్లకు సంబంధించి యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ వద్ద కచ్చితమైన మార్గదర్శకాలు లేవు. ఈ అనిశ్చితి నేపథ్యంలో ఆగస్టు 25 తర్వాత అమెరికాకు వచ్చే పోస్టల్ కన్‌సైన్‌మెంట్లను స్వీకరించలేమని విమానయాన సంస్థలు పేర్కొన్నాయి. దీంతో యూఎస్‌కు పంపే పోస్టల్ పార్శిళ్ల బుకింగ్‌లను డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్ తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ నెలాఖరులో అమల్లోకి వచ్చే కస్టమ్ నిబంధనల కారణంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు- తెలిపింది.

## గుట్టలా? నోట్ల కట్టలా!

మొదటిపేజీ తరువాయి..



ఈ వార్త కర్ణాటకలో ఉన్న అధికార కాంగ్రెస్‌ను ఒక్కసారిగా కుదిపేసింది. కర్ణాటకలోని కాంగ్రెస్ ఎమ్మెల్యే కేసీ వీరేంద్ర పై ఆన్‌లైన్ బెట్టింగ్ రాకెట్ నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణల నేపథ్యంలో అతనికి చెందిన 30 ప్రాంతాల్లో దేశవ్యాప్తంగా ఏకకాలంలో సోదాలు నిర్వహించారు ఈడీ అధికారులు. తగిన సమాచారం వచ్చాక గ్యాంగ్ టక్ లో ఉన్న ఎమ్మెల్యే వీరేంద్రని ఈడీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అయితే ఈడీ చేసిన తనిఖీల్లో లెక్కలో లేని ఎన్నో లక్షల రూపాయల డబ్బు, బంగారం బయటపడినట్లు తెలుస్తోంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నిర్వహించిన ఈ సోదాల్లో సుమారు రూ. 12 కోట్ల నగదు, రూ. 6 కోట్ల విలువైన బంగారం, రూ. 10 కోట్ల విలువైన వెండి వస్తువులను జప్తు చేసినట్లు తెలుస్తోంది. ఇందులో కోటి రూపాయలకు పైగా విదేశీ కరెన్సీ కూడా ఉన్నట్లు సమాచారం. నాలుగు ఖరీదైన వాహనాలను ఈడీ అధికారులు సీజ్ చేశారు. వీటితో పాటు రెండు బ్యాంకు లాకర్లు, 17 బ్యాంకు ఖాతాలను ఈడీ అధికారులు ఫ్రీజ్ చేశారు. ఈ బెట్టింగ్ కుంభకోణం దుబాయ్ కేంద్రం జరుగుతోందని ఈడీ అధికారులు నిర్ధారణకు వచ్చారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర సోదరుడు కేసీ తిప్పేస్వామి, కుమారుడు పృథ్వీ ఆన్‌లైన్ గేమింగ్ వ్యవహారాన్ని నడిపిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. పలు గేమింగ్ వెబ్‌సైట్లను అతడు నిర్వహిస్తున్నట్లు ఈడీ అధికారులు అంటున్నారు.

## అడుగు ట్రెండ్స్

### సాయి సందేశ్ తేజ



## గీ యిల్లు కట్టినోనికి దండం పెట్టాలె!?

యెనకటికి...ఇల్లు కట్టి సూడు.. పెండ్లి సేసి సూడన్నరు. ఇల్లు కట్టుడు, పెండ్లి జేసుడు గంత కనాకష్టం అన్నమాట! మన పెద్దలు మస్తు అనుబవంతోటి గందుకే గా సామెత సెప్పిండ్లు. ఇగ గిప్పుడైతే కట్టిన



ఇండ్లు గట్టిగ నిల్తలేవు. ఇగ సేసిన పెండ్లిండ్లు, యిడుపుకాయితమై పుటుక్కున తెగిపోబట్టె. ఏం జేస్తం కలికాలం! గిది సరే గనీ, గీ ఇల్లు సూడుండ్లి. ఎట్లున్నదో. బోర్న ఆన, జోర్గ వర్ద. వస్తనే ఉంది. ముంచెత్తుతనే ఉంది. గా ఇల్లు మాత్రం యేటికి ఎదురీదినట్లు గట్టిగ నిలబడ్డది. గింత గూడ కరాబు కాలే. పెట్టిన గోడ పెట్టినట్లు, కట్టిన ఇల్లు కట్టినట్లే ఉన్నది. గంత వర్దల గింత గూడ కదల్లి గీదీన్ని గవాడెవడో యీడియో దీసిండు. తీసినోడు తీయక "గీ యిల్లు కట్టినోడెవడో గవాడ్ని దొరకబట్టాలె. పెద్ద పెద్ద డ్యాంలు, బిడ్జీలన్నీ గవానికే కట్టమని కాంట్రాక్టు యియ్యాలె.' అని రాసి, ఎక్స్ కాతాల పెట్టిండు. దీన్ని సూసినోడు సూసినట్టే లైకులు కొట్టిండ్రు. షేర్లు జేసిండ్రు. సూత్తాంటే 12యేల మంది లైకులు కొట్టి, 5 లచ్చల మంది సూసిండ్రట. యిగ సూసినోడు సూసి ఊకుంటాడు. ఏదో ఒకటి రాత్తనే ఉన్నరు. 'యీ యిల్లెవడో కాంక్రీట్తో కట్టినట్లుందే?' అని ఒగడు ఆశీరపోయిండు. 'యేగాదు. గీ యిల్లు కట్టినోనికి దండం పెట్టాలె!? అని మరొకడు 'ఏమోజీ'లతోని కామెంట్లు పెట్టబట్టిండ్లు. ఇచ్చెంత్రం గాకపోతే, గంత వర్దకు గీ గింత యిల్లు ఎట్లాగిందో గదా!? యెహె, గిదంతెందుకు? మీరూ సూడుండ్లి!

## అభివృద్ధి పేరుతో కాంగ్రెస్ మోసం

కొడకండ్ల, ఆగస్టు 23 (అడుగు న్యూస్): అభివృద్ధి పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని బిఆర్ఎస్ పార్టీ పాలకుర్తి మండల అధ్యక్షులు పసునూరి నవీన్ ఆరోపించారు. శనివారం,



జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తోందని తీవ్రస్థాయిలో విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిధులు మంజూరు చేసి పూర్తి చేసిన అభివృద్ధి పనులకు కేవలం పెయింటింగ్ వేసి, కొత్త శిలాఫలకాలు పెట్టి ప్రారంభోత్సవాలు చేయడం కాంగ్రెస్ నాయకుల మూర్ఖత్వమని అన్నారు. కాంగ్రెస్ నేతలు ఫోటోలు దిగడమే తప్ప నిధులు తేవడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. మహిళలకు నెల నెలా రూ.2500, పెళ్లి అయిన ఆడపడుచులకు తులం బంగారం ఇవ్వాలని హామీలను గుర్తు చేశారు. అభివృద్ధి పనులపై కాంగ్రెస్‌కు నైతిక హక్కు లేదని, ప్రజలు ఈ మోసాన్ని తప్పకుండా గుర్తిస్తారని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, ఉపాధ్యక్షుడు పాము శ్రీనివాస్, సీనియర్ నాయకులు బాలునాయక్, మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాయపర్తి మండలంలో బిల్లా సేవ కార్యక్రమం

రాయపర్తి, ఆగస్టు 23 (అడుగు న్యూస్): పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఆదేశాల మేరకు బిల్లా శివాని రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో



రాయపర్తి మండలంలోని రావుల తండా, విద్యానగర్ తండా ప్రాంతాల్లో తండావాసులకు ట్రస్ట్ చైర్మన్, మాజీ టీపీసీసీ కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి 200 హైజెనిక్ మినరల్ వాటర్ క్యాన్లను పంపిణీ చేశారు. పేదలకు సహాయం చేయడమే లక్ష్యంగా గత 10 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, భవిష్యత్తులో మరింత విస్తృతంగా కొనసాగిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, తండావాసులు పాల్గొన్నారు.

## అంతా తూచ్!

మొదటిపేజీ తరువాయి..

హాజరు పరిచింది. 2024 జూలైలో చెన్న పోలీస్ స్టేషన్‌లోకి ఒక పుర్రెను తీసుకువచ్చి, ధర్మస్థల లో " మహిళల శవాలు సహా వందలాది శవాలను పూడ్చివేయడానికి సహాయం చేశాను" అని పోలీసులకు చెప్పాడు. తనను పాపభావం వెంటాడుతోందని.. రక్షణ ఇస్తే స్థలాలు చెప్పి సాక్షిగా మారుతానని చెప్పాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. అతను గతంలో కొంత కాలం అక్కడ పారిశుధ్య కార్మికునిగా పని చేశారు. ఆయన "విజిల్ బ్లోయర్"గా చెప్పుకుని ధర్మస్థల గ్రామంలో "సామూహిక బలాత్కారాలు, హత్యలు" జరిగాయని ఫిర్యాదుచేశాడు. శవాలను సామూహికంగా పూడ్చివేశామని చెప్పాడు. తనతో పాటు ఓ పుర్రెను కూడా సాక్ష్యంగా తీసుకు వచ్చాడు. దీంతో కర్ణాటకలో దుమారం రేగింది. అక్కడి ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించింది. ధర్మస్థలలో అతను చెప్పిన చోటల్లా తవ్వినా.. ఎక్కడా మానవ అవశేషాలు బయటపడలేదు. చివరికి తాను తప్పు చెప్పానని ఓ వ్యక్తి పుర్రెను ఇచ్చి .. అలా ఫిర్యాదు చేయమన్నాడని మాట మార్చారు. అలాగే.. తన కుమార్తె ధర్మస్థలకు వెళ్లి కనిపించలేదని ఆరోపణలు చేసిన సుజాత భట్ అనే మహిళ కూడా మాట మార్చారు . తనకు అసలు అనన్య పేరుతో కూతురు లేదని.. కేవలం ఓ వివాదం కారణంగా ఒత్తిడికి లోనై, అలా చెప్పాల్సి వచ్చిందని చెప్పింది. లక్షలాది మంది. భక్తులు వచ్చే ప్రాంతం కావడం.. అది ఓ ట్రస్ట్ అధీనంలో ఉండటంతోనే ఈ వివాదం అంతా ప్రారంభమయింది. ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసి విచారణ చేస్తోంది. కానీ ఎక్కడా ఆ పని మనిషి చెప్పిన మానవ అవశేషాలు లభించలేదు. ముఖ్యంగా మహిళలు, చిన్న పిల్లల అవశేషాలు లభించలేదు.

## ఆ తీర్పిచ్చిన జడ్జీలంతా నక్సల్సేనా?

మొదటిపేజీ తరువాయి..

తీర్పు అని స్పష్టం చేశారు.కేంద్ర హోంమంత్రితో ఈ విషయంపై నేరుగా చర్చకు దిగాలని అనుకోవడం లేదు. గతంలో ఆ తీర్పు నేనే రాశాను. కానీ, అది నా తీర్పు కాదు.. సుప్రీం కోర్టు ఇచ్చినది. 40 పేజీల ఆ తీర్పును అమిత్ షా చదవాలని ఆశిస్తున్నా. ఒకవేళ అది చదివి ఉంటే ఆ వ్యాఖ్యలు చేసి ఉండేవారు కాదు. ఇదే నేను చెప్పదలచుకున్నా. ఇంతటితో ఈ చర్చను ఆపేద్దాం అని జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. దేశ ప్రజాస్వామ్యంలో లోటు కనిపిస్తోందని, రాజ్యాంగం కూడా సవాళ్లు ఎదుర్కొంటోందని ఇండియా కూటమి తరఫున ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా విపక్షాలు ఎంపిక చేయడాన్ని గౌరవంగా భావిస్తున్నానని చెప్పిన జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి కులగణన అవసరమని ఓ ఇంటర్వ్యూలో అభిప్రాయపడ్డారు. తెలంగాణలో కులగణనకు సంబంధించి ఆయన చొరవ తీసుకున్నారు. కుల గణనపై మాట్లాడుతూ.. సామాజిక ఆర్థిక విధానాల రూపకల్పన కోసం దీనిని చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

# ఆటలు

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..



## గిల్ రాకతో ఇది మరింత బలపడిన భారత్

టీమ్ ఇండియా టీ20 ఫార్మాట్‌లో ఇప్పటికే చాలా బలంగా ఉంది. భారత్ 2024లో జరిగిన టీ20 ప్రపంచ కప్ ను కూడా గెలుచుకుంది. కానీ అప్పుడు భారత జట్టుకు రోహిత్ శర్మ కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఈ ప్రపంచ కప్ తర్వాత రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ రిటైర్మెంట్ ప్రకటించారు. ఆ తర్వాత టీ20 జట్టుకు సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్‌గా వచ్చాడు. యువ భారత జట్టు సిద్ధమైంది. అప్పటి నుంచి భారత్ టీ20లలో మెరుగ్గా రాణిస్తోంది. ఈసారి ఆసియా కప్ టీ20 ఫార్మాట్‌లో జరగనుంది. భారత జట్టులో ఒకరితో ఒకరు పోటీ పడే ఆటగాళ్లు ఉన్నారు. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో ఈ జట్టు ఇప్పటికే చాలా బలంగా ఉంది, కానీ ఇప్పుడు శుభ్‌మన్ గిల్ జట్టులోకి రావడంతో ఆసియా కప్‌లో పెద్ద రచ్చ జరగవచ్చు. గిల్ భారత బ్యాటింగ్ లైనప్‌ను మరింత బలోపేతం చేశాడు. భారత ప్లేయింగ్ ఎలెవన్ ఓపెనింగ్‌లో అభిషేక్ శర్మతోపాటు శుభ్‌మన్ గిల్ కూడా రావచ్చు. ఆ తర్వాత మూడో నంబర్‌లో తిలక్ వర్మ జట్టుకు మంచి స్కోర్ అందించవచ్చు. మిడిల్ ఆర్డర్‌లో సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా పరుగులు వేగవంతం చేసే బ్యాట్స్‌మెన్‌గా ఉంటారు. ఆ తర్వాత రింకు సింగ్, జితేశ్ శర్మ,అక్షర్ పటేల్ పవర్ హిట్టర్‌లుగా కనిపించవచ్చు. ఈ బ్యాటింగ్ లైనప్‌తో భారత్ 8వ నంబర్ వరకు దూకుడుగా బ్యాటింగ్ చేయగలదు. ఆసియా కప్‌లో 20 ఓవర్ల ఆటలో భారత్ మొదటి నుంచీ దూకుడుగా బ్యాటింగ్ చేయవచ్చు.శుభ్‌మన్ గిల్ రాకతో భారత టీ20 జట్టు మరింత దూకుడుగా మారింది. గిల్ ఇటీవల ఇంగ్లండ్‌లో జరిగిన ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా 5 మ్యాచ్‌ల్లో 750కి పైగా పరుగులు చేశాడు. అదే సమయంలో, గతంలో %ఖ్రూ% 2025లో గిల్ 15 ఇన్నింగ్స్‌లలో 650 పరుగులు చేశాడు. గిల్ బ్యాటింగ్ గణాంకాలు అతనిలో పరుగుల ఆకలిని చూపిస్తున్నాయి. గిల్ ఆసియా కప్‌లో కూడా రాణిస్తే, అప్పుడు ఈ ఆటగాడిని జట్టులో చేర్చుకోవడం భారత్‌కు చాలా లాభదాయకంగా ఉంటుంది.

## చైనీస్, జపానీస్, థాయ్ ఫుడ్ అలవాటు చేసింది సచినే

### భారత మాజీ ఓపెనింగ్ బ్యాటర్ వీరేంద్ర సెహ్వాగ్



భారత క్రికెట్‌లో కొందరు ఆటగాళ్లు మైదానంలోనే కాదు, బయట కూడా గొప్ప ప్రభావం చూపించారు. ఒక తరానికి స్ఫూర్తి నింపిన వారిలో కొందరు స్టార్ ప్లేయర్స్ అగ్రస్థానం దక్కించుకున్నారు. లెజండరీ ప్లేయర్స్ ఆట చూసి బ్యాట్ పట్టినవారు ఎంతమందో. ఇక వీరేంద్ర సెహ్వాగ్ కూడా అలానే వచ్చారట. ఇక ఇటీవల అతను ఓ ఇంటర్వ్యూలో చెప్పిన ఓ విషయమైతే ఇప్పుడు ఫ్యాన్స్‌లో చర్చనీయాంశమైంది. కొన్ని విషయాలు ఒక స్టార్ క్రికెటర్ చెప్పకపోతే తెలిసేది కాదని అన్నాడు. వీరేంద్ర సెహ్వాగ్‌కి భారత క్రికెట్‌లో ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. ఓపెనింగ్ బ్యాటర్‌గా అతని రాక, అటాక్ స్టైల్‌తో మ్యాచ్ ఫ్లో ను మార్చేశాడు. 1999లో టీమ్‌ఇండియా తరఫున వన్డే డెబ్యూ చేసిన సెహ్వాగ్ 2001లో టెస్ట్ క్రికెట్‌లోనూ అరంగేట్రం చేశారు. చాలా తక్కువ సమయంలోనే అత్యుత్తమ ఓపెనర్ అని పిలిపించుకునే స్థాయికి చేరుకున్నాడు. సెహ్వాగ్‌కి ప్రత్యేకత ఏమిటంటే తొలి బంతి నుంచే బౌలర్లపై దాడి చేయడం. టెస్ట్‌ల్లో కూడా అదే స్టైల్‌ను కొనసాగించి, మూడు ట్రిపుల్ సెంచరీలు సాధించిన రేర్ అచీవ్‌మెంట్ ఆయనకే దక్కింది. 2008లో చెన్నైలో దక్షిణాఫ్రికా జట్టుపై చేసిన 319 పరుగులు ఇప్పటికీ అభిమానులకి గుర్తుంటాయి. వన్డేల్లో రికార్డులు మరింత ప్రత్యేకం. 2011లో ఇండోర్‌లో వెస్టిండీస్‌పై 219 పరుగులు చేసి, వన్డే క్రికెట్‌లో డబుల్ సెంచరీ చేసిన రెండో ఆటగాడిగా నిలిచాడు. ఐపీఎల్‌లో దిల్లీ డేర్‌డెవిల్స్‌కి కెప్టెన్‌గా వ్యవహరించి, తన అగ్రెసివ్ శైలి చూపించాడు.

## ఫ్యాన్ పేజ్‌లో ప్రియా సరోజ్ ఫొటో చూసి ఇష్టపడ్డా

### భారత క్రికెటర్ రింకు సింగ్

భారత క్రికెటర్ రింకు సింగ్ ఇటీవల లోక్‌సభ ఎంపీ ప్రియా సరోజ్‌తో ఎంగేజ్మెంట్ చేసుకున్నాడు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో వీళ్ల పెళ్లి ఉండనుంది. అయితే రింకునేమో మైదానంలో సిక్స్‌లు బాదుతూ ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తాడు. మరోవైపు అతడి కాబోయే భార్య ప్రియా ప్రజల కోసం రాజకీయల్లోకి వచ్చి ఎంపీ అయ్యింది. 2022 ఐపీఎల్‌లో మ్యాచ్ సందర్భంగా ప్రియను తొలిసారి చూసినట్లు రింకూ తెలిపారు. మ్యాచ్ కోసం ప్రియ ముంబయికి వచ్చినప్పుడు ఓ ఫ్యాన్ పేజ్‌లో ప్రియా సరోజ్ ఫొటో చూసి ఆమెను ఇష్టపడినట్లు తెలిపాడు. అలా తనకు ఆమెపై ప్రేమ మొదలైందని వెల్లడించాడు. చూడగానే ఆమెనే తనకు సరైన భాగస్వామి అనిపించిందని, కానీ ఆ విషయం చెప్పడానికి ధైర్యం సరిపోలేదని అన్నాడు. కొన్ని రోజుల తర్వాత తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఫొటోలను ప్రియ లైక్ చేసినట్లు గుర్తించాడట. అప్పుడు ప్రియకు మెసేజ్ చేసినట్లు చెప్పాడు.ఇక అప్పటి నుంచి ఆమెతో రోజూ మాట్లాడేవాడని అన్నాడు. ఇరువురు ఫోన్లో ప్రతిరోజు మాట్లాడుకునేవాళ్లట. అలా కొంత కాలం తర్వాత పెళ్లి చేసుకోవాలనే ఆలోచనకు వచ్చినట్లు పేర్కొన్నాడు. అనంతరం ప్రియ ఎంపీ అయ్యారు. ఆమె ఎంపీ అయ్యాక కూడా తమ మధ్య ఉన్న ప్రేమలో మాత్రం మార్పు రాలేదని రింకూ తెలిపాడు.అయితే ఎంపీగా ఆమె ఎప్పుడూ ప్రజల మధ్య ఉంటూ, వారి సమస్యల పరిష్కారం కోసం పని చేయడం, పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనడం, మరోవైపు తాను కూడా వరుస క్రికెట్ మ్యాచ్ లతో బిజీగా ఉండడం వల్ల ఇద్దరికీ సరదాగా మాట్లాడుకోడానికి సమయం దొరికేది కాదని అన్నాడు. అందుకే రాత్రి వేళల్లోనే కాసేపు మాట్లాడుకుంటామని పేర్కొన్నాడు. అలాగే కెరీర్ పరంగా అవసరమైన సమయంలో సలహాలు, సూచనలు ఇచ్చిపుచ్చుకుంటామని రింకూ అన్నాడు.జూన్ 08న లఖ్‌నవూ సెంట్రమ్ హోటల్‌లో రింకూ-ప్రియా సరోజ్ నిశ్చితార్థం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు మాజీ క్రికెటర్లు ప్రవీణ్ కుమార్, పీయూష్ చావ్లా, ఉత్తరప్రదేశ్ రంజీ జట్టు కెప్టెన్ ఆర్యన్ జుయల్ హాజరయ్యారు. అలాగే పలువురు రాజకీయ నేతలు కూడా వచ్చారు. అయితే ఈ వేడుకకు బాలీవుడ్ స్టార్ హీరో, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు ఓనర్ షారుక్ ఖాన్‌ను కూడా రింకూ ఆహ్వానించాడు. అయితే బిజీ షెడ్యూల్ కారణంగా షారుక్ ఎంగేజ్‌మెంట్ ఈవెంట్‌కు రాలేకపోయారని రింకూ వెల్లడించాడు. ప్రియా సరోజ్ ఉత్తర్ ప్రదేశ్ మచ్లీషహర్ నియోజకవర్గం ఎంపీగా ఉన్నారు.



# సినిమా

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..



## ఎన్టీఆర్ స్ఫూర్తితో శ్రీలీలకు డ్యాన్స్ నేర్పించా

### తల్లి డాక్టర్ స్వర్ణలత ఆసక్తికర కామెంట్స్

ప్రముఖ నటుడు జూనియర్ ఎన్టీఆర్ పై నటి శ్రీలీల తల్లి, డాక్టర్ స్వర్ణలత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శ్రీలీలకు డ్యాన్స్ నేర్పించేందుకు ఎన్టీఆర్ స్ఫూర్తి అని తెలిపారు. జగపతి బాబు హోస్ట్‌గా వ్యవహరిస్తున్న 'జయమ్ము నిశ్చయమ్మురా' టాక్‌షోలో శ్రీలీల, స్వర్ణలత పాల్గొన్నారు. బాల్యంలో ఎన్టీఆర్ కూచిపూడి నృత్య ప్రదర్శనకు సంబంధించిన ఫొటోని డిస్‌ప్లే చేయగా.. స్వర్ణలత నాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. నాకు అమ్మాయి పుడితే డ్యాన్స్ నేర్పించాలని నిర్ణయించుకున్న క్షణాల్ని గుర్తుచేసే ఫొటో ఇది అని తెలిపారు. అప్పుడు ఎన్టీఆర్‌తో మీరు మాట్లాడారా? అని అడగ్గా.. 1997లో లాస్‌ఏంజెలెస్‌లో జరిగిన 'తానా' సభల్లో మాట్లాడా. అనుకున్నట్టే శ్రీలీలకు డ్యాన్స్ నేర్పించానని స్వర్ణలత తెలిపారు. తాను తెలుగు, కన్నడ, హిందీ, ఇంగ్లిష్‌లో మాట్లాడగలనని, కొత్త భాష నేర్చుకోవడం ఎప్పుడూ ఆసక్తే అని శ్రీలీల ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 'కెరీర్‌లో దూసుకెళుతున్నావ్. వేరే హీరోయిన్ల అవకాశాలు కూడా తీసుకుంటు-న్నావ్' అని జగపతి బాబు సరదాగా అన్నారు. ఈ ఎపిసోడ్ ఓటీటీ- 'జీ 5'లో స్ట్రీమింగ్ అవుతోంది. తొలి ఎపిసోడ్‌లో ప్రముఖ నటు-డు నాగార్జున సందడి చేసిన సంగతి తెలిసిందే.ఇటీ-వల 'జూనియర్' మూవీతో ప్రేక్షకులను పలకరించిన శ్రీలీల.. 'మాస్ జాతర', 'పరాశక్తి' 'ఉస్తాద్ భగత్‌సింగ్' తదితర చిత్రాల్లో నటిస్తున్నారు. ఎన్టీఆర్ కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందిన సంగతి తెలిసిందే. 12 ఏళ్ల సాధనలో వందకిపైగా ప్రదర్శనలిచ్చారు.

## కింగ్డమ్ నుంచి అన్నా...

## పాట విడుదల

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం కింగ్డమ్. భాగ్య శ్రీ బోర్సే కథానాయికగా నటించగా.. సత్యదేవ్ కీలక పాత్రలో నటించాడు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించాడు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో, సితార ఎంటర్-టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమా ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. తాజాగా ఈ సినిమా నుంచి ఎమోషనల్ సాంగ్ అన్నా అంటేనే పాట ఫుల్ వీడియోను విడుదల చేశారు. అన్నా అంటేనే.. ఉన్నానంటూనే అంటూ తన సోదరుడితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఎమోషనల్‌గా సాగింది ఈ పాట. ఈ పాటను కృష్ణకాంత్ రచించగా, అనిరుధ్ స్వరపరిచి స్వయంగా ఆలపించారు. ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ, సత్యదేవ్ అన్నదమ్ములుగా నటించారు. ఆ ఇద్దరి నేపథ్యంలో సాగే పాటే ఇది.




## కొత్త తరం కథలంటే నాన్నకు ఇష్టం

### తండ్రి కమల్ గురించి శృతిహాసన్

సెలబ్రిటీలు అంటే అందరికీ ఒకే అభిప్రాయం ఉంటుంది. కోట్ల రూపాయలు సంపాదిస్తారు, లగ్జరీ లైఫ్ ఎంజాయ్ చేస్తారు, ఖరీదైన కార్లు, బంగ్లాలు కొంటారు. నిజానికి చాలా స్టార్‌లు కూడా అలానే ఉంటారు. మార్కెట్లోకి వచ్చిన కొత్త లగ్జరీ కార్లను ఎప్పటికప్పుడు కొనుగోలు చేస్తారు. కోట్ల రూపాయల విల్లాలు, ఫారిన్ ప్రాపర్టీస్, బ్రాండ్‌డ్ వస్తువులు ఇవన్నీ వారి లైఫ్‌లో భాగమే. కానీ అందరికీ ఒకే ఫార్ములా ఉండదు! విశ్వనటుడు కమల్ హాసన్ మాత్రం పూర్తిగా భిన్నంగా ఉంటారని అసలు విషయం కూతు శృతి హాసన్ బయటపెట్టింది. ఆయన ఖరీదైన కార్లు కొనరు. విల్లాలు, ఫారిన్ ప్రాపర్టీస్ జోలికే వెళ్లరట. ఈ విషయాన్ని ఆయన కుమార్తె శ్రుతి హాసన్ తాజాగా రివీల్ చేసింది. ఆమె చెప్పిన దానీ ప్రకారం.. 'నాన్నకి తెలిసినది ఒకటే - కొత్త కాన్సెప్ట్‌తో వచ్చే సినిమాల్లో పెట్టు-బడి పెట్టడం. టెక్నికల్ క్వాలిటీ ఉన్న కథలు అంటే ఆయనకు చాలా ఇష్టం. వాటికి అవసరమైన డబ్బు ఖర్చు చేయడంలో ఆయన ఎప్పుడూ



వెనుకడుగు వేయరు. ఎందుకంటే నాన్నకు డబ్బు శాశ్వతం కాదన్న నమ్మకం ఉంది. సినిమాల ద్వారా సంపాదించిన దానికంటే పోగొట్టు-కున్నదే ఎక్కువ. కానీ ఇంట్లో చాలా సింపుల్ లైఫ్÷-టస్టైల్ ఇష్టపడతారు. ఖరీదైన వస్తువుల పై ఆయనకు అసలు ఆసక్తి ఉండదు. విల్లాలు, భూములు, ఫారిన్ ప్రాపర్టీస్ ఏవీ ఆకర్షణీయంగా అనిపించవు. బదులుగా, -టె-క్నాలజీకి సంబంధించిన కొత్త విషయాలు తెలుసుకోవడంలో ఎక్కువ ఆసక్తి చూపుతారు. అలాగే కొత్త ఐడియాస్, సబ్జెక్ట్స్ ఉన్న డైరెక్టర్స్‌ను ప్రోత్సహించడం ఆయనకు ప్యాషన్' అని శ్రుతి హాసన్ తెలిపింది. అంటే ఇండస్ట్రీలో చాలా మంది స్టార్‌లు సంపాదనతో పాటు- స్థిరాస్తులు కూడబెట్టుకుంటుంటే, కమల్ మాత్రం సినిమాల మీద ప్యాషన్ కోసం సంపాదన అంతా ఖర్చు చేసే వ్యక్తి అని చెప్పవచ్చు.

## కాంతారా ప్రీక్వెల్ ద్వారా వందకోట్లపై దృష్టి

కన్నడ సినీ పరిశ్రమ నుంచి వచ్చిన 'కాంతార' సినిమా పాన్-ఇండియా స్థాయిలో సెన్సేషన్ క్రియేట్ చేసిన సంగతి తెలిసిందే. నటుడు రిషబ్ శెట్టి దర్శకత్వం వహించిన ఈ చిత్రం కేవలం కన్నడలోనే కాకుండా, తెలుగు స్టేట్స్‌లో కూడా భారీ విజయం సాధించింది. ఇప్పుడు ఆ విజయాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు, మేకర్స్ ప్రీక్వెల్‌ని తో రాబోతున్నారు. ఈ ప్రీక్వెల్ అక్టోబర్ మొదటి వారంలో విడుదల కానుంది. అయితే అసలు హాట్ టాపిక్ ఏమిటంటే.. ఈ సినిమా కోసం మేకర్స్ తెలుగు రాష్ట్రాల్లో భారీ బిజినెస్‌ని ఆశిస్తున్నారట. ఏకంగా 100 కోట్ల మేర డీల్ గా మేకర్స్ క్విట్ చేస్తున్నారట. ఇది మాత్రం ఒక షాకింగ్ మొత్తం అని చెప్పాలి. పార్ట్ 1 ఎంత పెద్ద హిట్ అయినప్పటికీ దానికి ప్రీక్వెల్ కూడా అదే రేంజ్ లో హిట్ అవుతుంది అని చెప్పడానికి లేదు. ఇప్పుడు వరకు పాన్ ఇండియా ఆడియెన్స్‌ని ఎ÷-జగైట్ చేసే సాలిడ్ కంటెంట్, -ట్రైలర్, ప్రోమోస్ కూడా రాలేదు. అయినప్పటికీ, మేకర్స్ భారీ బిజినెస్ ఆశిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో చాలా సినిమాలు బిజినెస్ విషయంలో అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో 'కాంతార ప్రీక్వెల్' కోసం ఇంత భారీ మొత్తం పెట్టడానికి డిస్ట్రిబ్యూటర్లు ముందుకు వస్తారా అన్నదే పెద్ద ప్రశ్న. మరి ఈ రూ.100 కోట్ల డీల్ నిజంగా జరుగుతుందా? లేక ఇది కేవలం మార్కెటింగ్ హైప్ మాత్రమేనా? అన్నది చూడాలి.



Printed, Published & Owned by Margam Rama on behalf of ADUGU DIGITAL MEDIA Pvt. Ltd, Printed and Published at ADUGU PRESS, H No: 7-120, PALAKURTHI Village & Mandal, Jangaon District, Telangana, PIN: 506146. Chief Editor: Dr.Margam Lakshmi Narayana, Ph.No. : 8499990005